క్లుప్తంగా

శాంతి భద్రతలకు సహకరించాలి



ధరూరు : శాంతి భద్రతలకు మండల ప్రజలు సహకరించాలని నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కొండా శ్రీహరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో శ్రీహరి బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ నుంచి ఇక్కడికి బదిలీపై రాగా.. ఇక్కడ గత ఆరునెలల పాటు పని చేసిన ఎస్ఐ అబ్దుల్ షుకూర్ గద్వాల జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా మారుతి సిటీ వెంచర్‌లో 2 ప్లాట్లలో అక్రమంగా వడ్డేపల్లి మండలానికి చెందిన కాశపోగు రాజు చెట్లను, ఫెన్సింగ్‌ను డోజర్‌తో తొలగించినట్లు ఆకుల అశోక్ కుమార్ ఫిర్యాదు చేశారు. అశోక్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఆటోలో అక్రమంగా 3 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కర్నూల్‌కు తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు నాగేష్, ఖాదర్ పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా పంచలింగాల శివారులోని తుంగభద్ర నది నుంచి టిప్పర్ ఇసుక లోడ్‌తో వెళ్తుండగా ఆర్డీఎస్ కాలువ రోడ్డుపై జల్లాపురం స్టేజి ప్రాంతంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ వెంకట ప్రతాప్‌నాయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీచుపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరమశివుడికి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివాలయంలో పూజలు..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివ మాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

వీపనగండ్ల: చాలీచాలని జీతాలతో పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఏఐటీయూసీ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టి ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపకార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీరాం, మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు దయాకర్, బాలీశ్వరమ్మ, లింగమ్మ, చెన్నమ్మ, రేణుక, వరలక్ష్మి, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత డాక్టర్‌కు బెస్ట్ రీసెర్చ్ అవార్డు

అమరచింత: పట్టణానికి చెందిన డాక్టర్ మంత్రి రమేష్ నిమ్స్ డైరెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ రీసెర్చ్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా వైద్యుడిగా సేవలు అందిస్తున్న ఆయన ఇమ్యూనిటీ వ్యవస్థపై ప్రత్యేకంగా పరిశోధనలు చేయడంతో బెస్ట్ రిసెర్చ్ అవార్డుకు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన డాక్టర్ రమేష్‌కు అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి చెందిన రోగులు నిమ్స్‌లో చేరారనే సమాచారం తెలిసిస్తే వెంటనే వారి వద్దకు వెళ్లి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్న డాక్టర్ రమేష్‌కు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షిస్తున్నారు.

హాస్టల్‌లో వసతులు కరవు..

- శిథిలమైన బీసీ హాస్టల్ భవనం
- పైకప్పు పెచ్చులూడిపడుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



శిథిలమైన బీసీ హాస్టల్ భవనం

అయిజ : నిరుపేద విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి విద్యాభివృద్ధికి తోడ్పడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు నీరుగారిపోతున్నాయి. ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టకపోవడంతో మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ పాలిట ఇది శాపంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరడం, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

1996లో బీసీ హాస్టల్‌ను నిర్మించారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాస్టల్ భవనంలో బస చేస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరం హాస్టళ్లో సుమారు 150 మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. ఈ ఏడాది 130 మంది విద్యార్థులు బస చేస్తున్నారు. హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కూడా అధికారులు కల్పించడం లేదు. విద్యార్థులు స్నానం చేయడానికి సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో కూడా చన్నీటి స్నానం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. నీటి వసతి కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

పెచ్చులూడుతున్న పైకప్పు...

హాస్టల్ భవనం శిథిలమవడంతో పైకప్పుల పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి. చిన్నారులు బిక్కుబిక్కుమంటూ ఆ భవనంలో ఉంటున్నారు. వర్షం కురిసిన సమయంలో భవనం పైనుంచి వర్షపునీరు కారుతుంది. కొన్ని గదులకు ఏర్పాటుచేసిన తలుపులు శిథిలమయ్యాయి. హాస్టల్లో మొత్తం 12 గదులు ఉండగా వాటిలో 8 గదులను విద్యార్థులకు కేటాయించారు. పైపెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతుండడంతో 3 గదులకు తాళం వేశారు. దీంతో గత 5 సంవత్సరాలుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి.

నిధుల కొరతతో ఇబ్బందులు..

హాస్టల్ భవనంలో తులుపులు, కిటికీలు శిథిలమయ్యాయి. వంట సరుకులు నిల్వ చేసుకునే 2 స్టోర్ రూంలు కూడా చిన్నవిగా ఉండడంతో వంట వండేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హాస్టల్ మరమ్మతు చేయించాలని 2013లో రూ. 14 లక్షల నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపిగా కేవలం రూ.5.40 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కాంట్రాక్టర్‌లు నాసిరకంగా పనులు నిర్వహించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.



పెచ్చులూడిపడుతున్న బీసీ హాస్టల్ గది

మరమ్మతు చేయడం లేదు..



హాస్టల్ భవనం శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా సరైనా మరమ్మతులు చేపట్టడం లేదు. పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నాం. 5 గదుల్లోనే 130 మంది విద్యార్థులం ఉండాల్సి వస్తుంది. దీంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-సిద్దార్థ, 9వ తరగతి

డోర్లు, కిటికీలు విరిగిపోయాయి..



హాస్టల్లోని అన్ని గదులకు డోర్లు, కిటికీల తలుపులు విరిగిపోయాయి. దోమలు ఉధృతంగా వస్తున్నాయి. దీంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నాం. కొత్త తలుపులు, కిటికీలు అమర్చాలి. ప్రస్తుతం చలికాలతో చన్నీటితో స్నానం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం.

-భరత్, పదో తరగతి

ప్రతిపాదనలు పంపించాం..



బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని, పైకప్పు పెచ్చులూడిపడుతుందని గత సంవత్సరం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేయించాలని కోరాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

-ఈశ్వర్‌రావు, బీసీ హాస్టల్ వార్డెన్

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి



అయిజలో వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సంఘ నాయకులు తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి 1వ తేది నుంచి ఓపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీం) అమలు చేయుచున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏబేలు, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమేష్, నరసింహులు, సుదర్శన్, శాంసన్, పక్కీరన్న, తిమ్మప్ప, రామానాయుడు, జహురుద్దీన్, గోవింద్, వెంకటేష్, మల్లేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం..

శాంతినగర్ : ఏకీకృత పెన్షన్ స్కీం బదులుగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పీఆర్టీయూ టీఎస్ వడ్డేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, అధ్యక్షుడు శేషన్న, వెంకటనర్సమ్మ, వెంకటేష్ శెట్టి, వెంకట్రావు, ఊషన్న, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, సునీల్ పాల్గొన్నారు.

విధులకు డుమ్మా.. అడిగితే ఆగ్రహం

ఉండవెల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందడం లేదని అడిగిన రామకృష్ణ అనే వ్యక్తిని ఎంపీడీఓ ఫోన్‌లో దుర్భాషలాడిన సంఘటన సోమవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కిషోర్ గ్రామ పంచాయతీలో గోడకు అతికించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాలేదని అక్కడ ఉన్న సిబ్బందిని అడగడంతో మాకేం తెలియదు.. కార్యదర్శిని అడగండని తెలిపారు. కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించగా సెలవులో ఉన్నానని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓను కలవడానికి వెళ్లారు. ఎంపీడీఓ తిరుపతన్న మధ్యాహ్నం 12 గంటలైన రాకపోవడంతో కిషోర్, రామకృష్ణ ఫోన్‌లో సంప్రదించారు. ఈ నేపథ్యంలో సదరు ఎంపీడీఓ రామకృష్ణను దుర్భాషలాడినట్లు బాధితుడు ఆరోపించాడు. కాల్ రికార్డింగ్ చేస్తున్నామని తెలపడంతో మాట మార్చినట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ దుర్భాషలాడిన ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఎంపీడీఓ సోమవారం కార్యాలయానికి రాలేదని సమాచారం. సంఘటనపై డీఆర్‌డీఓ నర్సింగ్‌రావ్‌ను వివరణ కోరగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాలలకు మైక్‌సెట్, డ్రమ్స్ వితరణ



గుంటిపల్లి పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న దాతలు

గద్వాల టౌన్ : మండల పరిధిలోని గుంటిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు మాజీ ఎంపీటీసీ శివకుమార్ రూ.16 వేల విలువైన మైక్‌సెట్, మాజీ సర్పంచ్ తెలుగు తిమ్మప్ప రూ.9 వేల విలువ గల డ్రమ్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ ప్రభాకర్‌శాస్త్రి, ఉపాధ్యాయులు కృపయ్య, సత్యనారాయణగౌడ్, చక్రధర్, నాగరాజు, సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు. తెలుగోనిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు లత, అనంతరెడ్డి దంపతులు మైక్‌సెట్ వితరణ చేశారు. రామచంద్రుడు పాఠశాలకు డ్రమ్‌సెట్ అందజేశారు. దాసరి బీసన్న విద్యార్థులకు టై బెల్టు, ఐడీ కార్డులు, ఆంజనేయులు విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరడి శ్రీకాంత్, వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న భైరంపల్లి గ్రామస్తులు

అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని భైరంపల్లి గ్రామ ప్రజలు సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దార్ మంజులకు అలంపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. భైరంపల్లి శివారులోని సర్వే నంబర్ 38లోని రెండు ఎకరాల భూమి సర్వే చేసి 32 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి గ్రామ సభలో తీర్మానం చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ కాలేదని ప్రస్తుతం పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఆసీఫ్ ఖాన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అయ్యన్న, చంద్రశేఖర్ నాయుడు, రాముడు, ఆసీఫ్‌ఖాన్, పరుషరాముడు, కృష్ణమనాయుడు, రఘుపతి నాయుడు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

మలుపుల్లో ప్రమాద సూచికలేవి..?



ఇటిక్యాల : జాతీయ రహదారి నుంచి ఇటిక్యాల మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా అధిక సంఖ్యలో మలుపులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను మలుపుల్లో గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా మలుపుల్లో ప్రమాద సూచిక బోర్డులు లేకపోడంతో ప్రమాదాల బారిన పడి గాయాలపాలౌతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నాతాధికారులు స్పందించి మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిధులు జమ.. రైతుల హర్షం

గట్టు : ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా నిధులు సోమవారం ఆరగిద్ద గ్రామ రైతుల ఖాతాల్లో జమ కావడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని ఆరగిద్ద గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, గణతంత్ర దినోత్సవం రోజున సంక్షేమ పథకాల అమలును జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలు ప్రారంభించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం నాటికి రైతులందరికీ రైతు భరోసా నిధులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లుగా సెల్‌ఫోన్లకు మేసేజ్ రావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆరగిద్ద గ్రామంలో మొత్తం 1038 మంది రైతులు ఉండగా, వారందరికీ ఎకరాకు రూ.6 వేల చొప్పున మొత్తం రూ.కోటి 38 లక్షలను జమ చేసినట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ యోగేశ్వరిలు తెలిపారు. రైతుల తరపున సీఎం రేవంత్‌రెడ్డికి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప బండారు ఉత్సవం



ఆత్మకూర్: కురుమ, యాదవుల ఆరాధ్యదైవమైన బీరప్ప బండారు ఉత్సవాలు ఆత్మకూర్ పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ శాసనసభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరి, రాష్ట్ర మార్కెటింగ్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకరిపై మరొకరు పసుపు చల్లుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్ యాదవ్, కురుమలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ అధికారులు

అలంపూర్ : అలంపూర్ క్షేత్రంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే విజయుడుకు కర్నూల్‌లోని ఆయన నివాసంలో ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు విక్రాంత్ శర్మ, అర్చకులు ధనుంజయ శర్మ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు జోగులాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు సంజీవరెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, శ్రీకాంతులు తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ధరూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గద్వాలకు రానున్నరని ఈనెల 30న నిర్వహించనున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు సన్నాహక సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల సీనియర్ నాయకులు రాములు, సత్యన్న, చింతరేవుల ఆంజనేయులుల నేతృత్వంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30 బృందావన్ గార్డెన్‌లో జరిగే సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్‌తో పాటు దాని అనుబంధ సంఘాలైన ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఇతర సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పరుశరాం, దళిత జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటన్న, నాయకులు రాములు, సత్యన్న, సంజీవ్, బుడత రాముడు, లింగన్న, కర్రెన్న, తిక్కనక్క, అంజి, గోవింద్, గోకారన్న, నర్సింహ, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



అల్వలపాడు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు : పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ రవీంద్ర బాబు న్నారు. మండల పరిధిలోని అల్వలపాడు ఉన్నత పాఠశాల, నీలహళ్లి ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, ప్రగతి సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్, మిడిల్ లైన్ టెస్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 10/10 సాధించి కన్నవారికి, చదువు చెప్పి గురువులకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టును కొల్లగొడుతున్న మట్టి మాఫియా



తరలించడానికి సిద్ధంగా ఉన్న మట్టి

గట్టు : ఎర్రగట్టు మట్టిని కొల్లగొడుతున్న ప్రశ్నించే అధికారులే కరువయ్యారని మండల ప్రజలు వాపోతున్నారు. చిన్నోనిపల్లె పునరావాస కేంద్రానికి ఆనుకుని ఉన్న ఎర్రగట్టు మట్టిని మాఫియా అక్రమంగా తరలించుకుపోతోంది. సోమవారం చాగదొన, మిట్టదొడ్డి గ్రామాలకు యంత్రాల సహాయంతో ట్రాక్టర్ల ద్వారా పట్టపగలే మట్టిని తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ యంత్రాంగం, పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని అంతంపల్లి, చిన్నోనిపల్లె పునరావాస కేంద్ర యువకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎర్రగట్టు సగం వరకు ఖాళీ చేశారని, పూర్తి స్థాయిలో ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు యువకులు తెలిపారు. ఎర్రగట్టు మట్టి తరలింపుపై నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎర్రగట్టు మట్టిని తరలిస్తున్న మాఫియాపై కఠినంగా వ్యవహరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏకల్ అభియాన్‌పై అవగాహన



చిత్రపటాలు పంపిణీ చేస్తున్న భగత్‌రెడ్డి

అయిజ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం సంచు సమితి భగత్‌రెడ్డి ఏకల్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరతమాత, సరస్వతీదేవి చిత్రపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏకల్ విద్యాలయ ఫౌండేషన్ భారతదేశంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలు నడిపే కల్ అభియాన్ ప్రాజెక్టుకు ప్రధాన సంస్థ అని తెలిపారు. ఏకల్ విద్యాలయాల్లో 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఐదు సంవత్సరాలు ఉచితంగా అనధికార విద్యనందిస్తుందన్నారు. సాధారణ పాఠశాలలో 8 లేదా 9వ తరగతి ఉత్తీర్ణులై ప్రత్యేక శిక్షణ పొందిన స్థానిక యువతతీ యువకులు 30 నుంచి 40 మంది ఉంటారన్నారు. కార్యక్రమంలో అంచల్ అభియాన్ ప్రముఖ్ మహదేవమ్మ, అంచల్ సాధక్ బాలకృష్ణ, సంచ్ ప్రముఖ్ రంగనాథ్, సంచ్ సాధక్ సోమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్‌కు సన్మానం చేస్తున్న రేషన్ డీలర్లు

అయిజ: ఉత్తమ తహసీల్దార్‌గా సేవా పురస్కారం అందుకున్న జ్యోతిని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు సోమవారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. భవిష్యతులో రైతులకు మరిన్ని సేవలందిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాముడు, డీలర్లు నాగన్న, శ్రీను, ఆర్ఐ మద్దిలేటి, జూనియర్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు.. వ్యక్తికి గాయాలు



కంపలోకి దూసుకెళ్లిన కారు

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై అతివేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు 100 మీటర్ల వరకు దూరం దూసుకెళ్లింది. సోమవారం హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు మద్దిలేటి, కిరణ్, వెంకటకృష్ణ అనే వ్యక్తి, మరోకరితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ఇటిక్యాలపాడు శివారులో రోడ్డు పక్కకు అదుపు తప్పి ఒక్కసారిగా ముల్లకంపలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న మద్దిలేటికి స్వల్ప గాయాలవడంతో 108 అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. సంఘటన జరిగిన ప్రదేశంలో రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యం వైపు దృష్టి సారించాలి



డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ : విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి సారించి విద్యనభ్యసించాలని మోటివేషనల్ స్పీకర డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సోమవారం వివిధ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపట్ల ఒకరు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను ఎంఈఓ రాములు, ఉపాధ్యాయ బృందం శాలువా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.